క్లుప్తంగా

కొనసాగుతున్న భూసర్వే

కుల్కచర్ల: అల్మాస్‌ఖాన్‌పేట్ రెవెన్యూ గ్రామంలో రైతుల భూముల సర్వే కొనసాగుతుంది. 60సంవత్సరాలుగా కాస్తులో ఉంటూ ఆన్‌లైన్‌లో పేర్లు లేని రైతుల వినతిమేరకు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ భూ సర్వే నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు రెవెన్యూ యంత్రాంగం ఆ గ్రామంలో 15రోజుల నుంచి భూ సర్వే నిర్వహిస్తున్నారు. గురువారం గిర్దవరి రవికుమార్ సిబ్బందితో కలిసి సర్వే చేశారు. అనంతరం రైతుల వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలను ఆయన పరిశీలించారు.

జోరుగా సమగ్ర కుటుంబ సర్వే

75శాతం పూర్తి


కోత్లాపూర్‌లో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్

తాండూరు రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సమగ్ర కుటుంబ సర్వే జోరుగా సాగుతుంది. 33 గ్రామ పంచాయతీల్లో 15,244 కుటుంబాలు ఉన్నాయి. గురువారం వరకు 11,675 కుటుంబాల సర్వే పూర్తిచేసినట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ తెలిపారు. మరో నాలుగు రోజుల్లో సర్వే పూర్తవుతుందన్నారు. శనివారం నుంచి సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం


విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయ బృందం

కుల్కచర్ల: మండల పరిధిలో అంతారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. మరికొందరు విద్యార్థులు వివిధ హోదాలలో అధికారులుగా వ్యవహరించి విద్యాశాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు మాట్లాడారు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, వారికి అన్ని రంగాల్లో, సామాజిక అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


సాజిదాబేగంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధారూరు: పేదలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ధారూరు మండల ధర్మ సమాజ్ పార్టీ గురువారం డిమాండు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ నాయకులు తహసీల్దార్ సాజిదాబేగంకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భూమి, ఇల్లు, ఉపాధి, వైద్యం, ఉచిత విద్య అందించాలని పేర్కొన్నారు. వారి జీవితాల్లో సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక మార్పును తీసుకరావాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ మండల పార్టీ కన్వీనర్ శేఖర్ మహరాజ్, కో కన్వీనర్లు సత్యం, రాజు, గ్రామ కమిటీల నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ చైర్మన్‌కు ఘన నివాళులు


నివాళులర్పిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు: తాండూరు మున్సిపల్ మాజీ చైర్మన్ నాగారం నర్సింహులుకు కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియలకు పలువురు నేతలు పాల్గొని నివాళులర్పించారు. నర్సింహులు మరణ వార్త తెలుసుకున్న శాసన మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేబుయ్యాని మనోహర్‌రెడ్డి, చెవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రాష్ట్రఫైనాన్స్ కమిషన్ సభ్యులు రమేష్‌మహరాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్‌లక్ష్మారెడ్డి, యాలాల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావులు గురువారం పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఐదేళ్లుగా పెండింగ్‌లోనే..!


మధ్యలోనే నిలిపేసిన కమ్యూనిటీ భవన నిర్మాణం

- అసంపూర్తిగా కమ్యూనిటీ భవనాలు
- బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మంజూరైనవి 28
- రెండింటిని పూర్తి చేసి మధ్యలోనే వదిలేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని అధికారులు

కొడంగల్: 2018లో కొడంగల్ నియోజకవర్గంలోని అన్ని సామాజిక వర్గాలకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కమ్యూనిటీ భవనాలను మంజూరు చేసింది. వాటి నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం మొదటి విడతలో కొంత మొత్తం నిధులు విడుదల చేసింది. అయితే పూర్తి స్థాయిలో నిధులు మంజూరు చేయక పోవడంతో ఐదేళ్లుగా పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. దీంతో ఆయా కమ్యూనిటీ వర్గాల ప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా..

2018 సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొడంగల్ మండలంలో 28 కమ్యూనిటీ భవనాలను మంజూరు చేసింది. అప్పట్లో హంగూ ఆర్భాటంతో ప్రారంభించినప్పటికీ వాటి నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ఒక్కో భవనానికి రూ.5లక్షల నుంచి రూ.25 లక్షల వరకు కేటాయించారు. అయినప్పటికీ అందులో రెండు భవనాల పనులు మాత్రమే పూర్తిచేశారు. మిగితావి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఉడిమేశ్వరం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్, రుద్రారంలోని లింగాయత్ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగిలిన వాటిలో 12 భవనాల నిర్మాణ పనులు అసలు ప్రారంభమే కాలేదు. 14 భవన నిర్మాణాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. నిధుల కొరత కారణంగా పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు వస్తున్నాయి. పేరుకు మాత్రమే కమ్యూనిటీ భవనాలు మంజూరు చేసి నిధులు కేటాయించడంలో గత ప్రభుత్వం జాప్యం చేసిందని పలు సామాజిక వర్గాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ ప్రాంతం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నారు. కమ్యూనిటీ భవనాలను పూర్తి చేసే విధంగా సీఎం సహకారం అందిస్తారని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మున్నూరు కాపులకు..

నియోజకవర్గంలో మెజారిటీ స్థాయిలో ఉన్న మున్నూరు కాపులకు గత ప్రభుత్వం కమ్యూనిటీ భవనాలను మంజూరు చేయలేదు. ఎన్నికల్లో మున్నూరు కాపులు స్వతంత్రంగా వ్యవహరించి వారికి నచ్చిన వారికి ఓటు వేశారు. ఏక పక్షంగా బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వలేదనే నెపంతో మున్నూరు కాపు కులస్తులకు ఎలాంటి ఆర్థిక పరమైన ప్రయోజనం చేకూర్చలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉంది. మున్నూరు కాపులకు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

నిధులు మంజూరు చేయాలి



కొడంగల్‌లో నిర్మిస్తున్న వీరశైవ లింగాయత్ లింగ బలిజ కమ్యూనిటీ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. గత ప్రభుత్వం మొదటి విడతలో రూ.10 లక్షలు మంజూరు చేసింది. పది లక్షలతో పనులు సగం వరకు చేపట్టారు. మలి విడతలో నిధులు మంజూరు చేయలేదు. దీంతో అసంపూర్తిగా అది మిగిలింది. ఇంకా రూ.10 లక్షల వరకూ ఖర్చవుతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పెండింగ్ పనులు పూర్తయితే వీర శైవ లింగాయత్ లింగ బలిజ సభ్యులకు ఈ భవన నిర్మాణం ఉపయోగకరంగా మారనుంది. దీంతో తాము శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించుకోవడాని వీలుంటుంది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారం అందించి వీరశైవ లింగ బలిజ భవనానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నాం.

– సంగమేశ్, వీరశైవ లింగాయత్ కమిటీ అధ్యక్షుడు, కొడంగల్

పర్యావరణ పరిరక్షణకు కృషి

- ఎంపీడీఓ రామకృష్ణ


రామకృష్ణకు జ్ఞాపిక అందజేస్తున్న సంస్థ నిర్వాహకులు

కుల్కచర్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కుల్కచర్ల ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఎస్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేధం, పర్యావరణ పరిరక్షణకు పాటించాల్సిన పలు అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుతం భూమిలో కరిగిపోయే బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ బ్యాగులు, కవర్లు రావడంతో వాటివల్ల ప్రకృతికి ఎలాంటి ఇబ్బందిలేదన్నారు. వాటిని ఎరువుగా ఉపయోగించుకోవచ్చన్నారు. అదే ప్లాస్టిక్ బ్యాగుల పరిమాణం 120మెక్రాన్‌లు లోపల గల కవర్ బ్యాగులు భూమిలో కలవకపోగా భూమిలోకి నీటిని చేరనివ్వదని, కాలుష్యమయ్యేవిధంగా సహకరిస్తుందన్నారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ తయారీ సంస్థ ఎంపీడీఓకు మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీఓ భాస్కర్ పాల్గొన్నారు.

అధ్వానంగా కరన్‌కోట్ రోడ్డు


లారీ వెనక లేస్తున్న దుమ్ము

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కరన్‌కోట్ రోడ్డు మార్గంలో దుమ్ము భరించలేకపోతున్నామని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా గౌతపూర్ చెక్ పోస్ట్ నుంచి గోపన్‌పల్లి వరకు రోడ్డు అధ్వానంగా మారింది. గతంలో ప్రభుత్వం రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. దీంతో పనులు దక్కించుకున్న సదరు కాంట్రాక్టర్ కంకరవేసి వదిలేయడంతో ఆ రహదారిగుండా ప్రయాణించాలంటే దుమ్ము మీద పడుతుందని చెబుతున్నారు. దీంతో ఈ రోడ్డుగుండా నిత్యం వాహనాలు వెళ్లేక్రమంలో దుమ్ము లేస్తోందని, అది కంట్లో పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం దుమ్ము లేస్తుండడంతో అనారోగ్యం బారిన తాము పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందిచి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లా స్థాయికి విద్యార్థుల ఎంపిక


కొడంగల్ రూరల్: విద్యార్థులతో ఉపాధ్యాయ సిబ్బంది


కొడంగల్: విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మక్సూద్ అలీ

కొడంగల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన చెకుముకి సైన్స్‌లో ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మండల స్థాయి పోటీ పరీక్షలను పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ పోటీల్లో పట్టణంలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అరుణ్‌కుమార్, అబ్దుల్ బాసిత్, సుమయ్యా పాతిమాలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీ పరీక్షల నిర్వాహకుడు శ్రీనివాసులు మాట్లాడారు. సైన్స్, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రతిభ కనబరిచి భవిష్యత్‌లో శాస్త్రవేత్తలుగా రాణించాలని కృష్ణవేణి పాఠశాల ప్రిన్సిపాల్ మహ్మద్ మక్సూద్ అలీ పేర్కొన్నారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీ పరీక్షలు నిర్వహించారు. మండలంలోని 12పాఠశాలల నుంచి ముగ్గురు చొప్పున 36మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల తెలుగు, ఇంగ్లీష్ మీడియం, కేజీబీవీ తెలుగు మీడియం, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల ఇంగ్లీష్ మీడియం, కృష్ణవేణి ట్యాలెంట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జన విజ్ఞాన వేదిక తాలూకా కన్వీనర్ శ్రీనివాస్‌లు తెలిపారు. విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కలగడానికి, వారిలో ఉన్న సృజనాత్మకతను పెంచడానికి, శాస్త్రవేత్తలుగా ఎదగడానికి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పోటీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, ఇంచార్జ్ హెచ్‌ఎం శ్యామలమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని మండల విద్యాధికారి హరిలాల్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. జెడ్పీహెచ్‌ఎస్ బొంరాస్‌పేట, చౌదర్‌పల్లి, రేగడిమైలారం తెలుగు, ఆంగ్ల మాధ్యమాలు, బొట్లోనితండా గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. జెడ్పీహెచ్‌ఎస్ బొంరాస్‌పేట విద్యార్థులు అభ్యాస్, కీర్తన, సుహాసిని, సమీనా, లక్ష్మిబాయి, పల్లవి జిల్లా స్థాయికి ఎంపికయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రశాంత్‌కుమార్, అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, మల్లయ్య, భవానీ, విక్రమ్‌సింగ్, నాగరాజు, సుభాష్, ఇజాజ్ హైమద్, కాశయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ

తాండూరు రూరల్: సమగ్ర కుటుంబ సర్వే ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీడీఓ సమావేశమందిరంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఏఎస్ఓ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించే శిక్షణకు నియోజకవర్గంలోని ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొనాలని తెలిపారు.

జంగమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

కుల్కచర్ల: బీసీ సామాజికవర్గంలో వెనుకబాటుకు గురౌతున్న జంగమ, బలిజ ప్రజల ఆర్థిక ఉన్నతికి ప్రత్యేకంగా జంగమ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని రాష్ట్ర జంగమ సమాజం కార్యదర్శి మందిపల్ మఠం రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వెనుకబడిన తరగతుల కులాల్లో ఒకటైన జంగమబలిజల సంఖ్యాకబలం తక్కువగా ఉండటం వల్ల తీవ్ర వెనుకాబాటుకు గురౌతున్నారని అన్నారు. తమను ప్రత్యేకంగా గుర్తిస్తేనే తమ కులస్తులు అభివృద్ధికి నోచుకుంటారని అన్నారు. అర్చక వృత్తిగల జంగమలకు రాష్ట్రంలోని వివిధ శైవాలయాలలో అర్చకులుగా అవకాశం కల్పించి జీతభత్యాలు అందించాలని పేర్కొన్నారు. వీరశైవ ఆగమ గురుకులాలను ఏర్పాటుచేసి జంగమ కులస్తులకు విద్యాభివృద్ధికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల వీర శైవ జంగమ సమాజం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతును రాజు చేయడమే లక్ష్యం

- ఎమ్మెల్యే కాలె యాదయ్య


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, మధుసూదన్‌రెడ్డి

షాబాద్: రైతును రాజు చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని సర్దార్‌నగర్ మార్కెట్‌యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం సన్నాలు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తుందన్నారు. ఆనాడు రైతులకు వైఎస్సార్ లక్ష రుణమాఫీ చేశారని, నేడు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, వాతావరణంలో జరుగుతున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని అధికారులు త్వరగా ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో ఎవరైనా మోసాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, పొల్యూషన్ కమిటీ చైర్మన్ చింపుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ జిల్లా చైర్మన్ కృష్ణారెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ చల్లా రాంరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు అశ్విని, మండల ఉపాధ్యక్షుడు రవీందర్‌యాదవ్, నాయకులు వెంకటేశ్, సుభాష్‌రెడ్డి, గౌరీ, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మల్లేశ్, కుమ్మరి చెన్నయ్య, మల్లేశ్, వెంకట్‌రెడ్డి, జంగయ్య, మాజీ సర్పంచ్‌లు రవీందర్ నాయక్, ప్రతాప్‌రెడ్డి, మునగపాటి నర్సింలు, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, విజేందర్‌రెడ్డి, సత్యం, శేఖర్ తదితరులు ఉన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన భాండాగారాలు

షాద్‌నగర్‌రూరల్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా అన్నారు. గురువారం పట్టణం సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నీతా మాట్లాడుతూ.. గ్రంథాలయాల్లో పుస్తకాల నిధి ఉంటుందన్నారు. గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివితే కొత్త విషయాలను తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులు పుస్తకాలను చదవడం అలవాటు చేసుకుంటే మేథోశక్తి పెంపొందుతుందన్నారు. విద్యార్థులకు కావాల్సిన కొన్ని పుస్తకాలు బయట దుకాణాలలో లభించవని, గ్రంథాలయాల్లో అన్ని రకాల పుస్తకాలు ఉంటాయన్నారు. పోటీ పరీక్షలకు సంబంధించిన అనేక పుస్తకాలు గ్రంథాలయాలలో అందుబాటులో ఉంటాయని, ఈ పుస్తకాలను చదువుకొని విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. గ్రంథాలయాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కళాజ్యోతి, లైబ్రేరియన్ జ్యోతి, రేణుక, అధ్యాపక బృందం, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే


రావులపల్లిలో సర్వే నిర్వహిస్తున్న ఏఈఓ పెంటయ్య

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఏఈఓలు డిజిటల్ క్రాప్ సర్వేలను కొనసాగిస్తున్నారు. ఒక్కో సర్వే నంబరులో ప్రత్యేక యాప్ ద్వారా రైతులు సాగు చేసిన పంటల వివరాలతో పాటు రైతు ఫొటోను యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఒక సర్వే నంబరులో 10మంది రైతులు ఉంటే వారి సాగు వివరాలను నమోదు చేస్తున్నారు. మండలంలో సాగు విస్తీర్ణం ప్రస్తుతం డిజిటల్ సర్వే ద్వారా తగ్గే అవకాశం ఉందన్నారు. రియల్ వ్యాపారం వల్ల వెంచర్లు ఏర్పాటు కావడం, హైదరాబాదు పరిసరప్రాంత వాసులు కొనుగోలు చేసిన భూములు బీడులుగా మారే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

మాల మహానాడు కమిటీ ఏర్పాటు

ధారూరు: ధారూరు మండల మాల మహానాడు కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బ్యాగరి వెంకటేశం, ఉపాధ్యక్షుడిగా బి రాజు, కావలి అంజయ్య, ప్రధాన కార్యదర్శిగా కావలి రాంచందర్, కోశాధికారిగా మాల నరేశ్, మండల అధికార ప్రతినిధిగా శివరాజు, మండల సోషల్ మీడియా ఇంచార్జిగా మహేశ్, సలహాదారుడిగా బి. చిన్నయ్య, తలారి సుదర్శన్, పురుషోత్తమ్‌లు ఆర్గనైజర్‌గా యాదన్న, బార శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ ధర్నా

- బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం
- నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్


ధర్నా నిర్వహిస్తున్న పోమాల్‌పల్లి గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఇటీవల రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో పోమాల్‌పల్లి గ్రామానికి చెందిన మల్లేశ్ గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన నందంచారి అజాగ్రత్తగా నడపడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని ఆరోపిస్తూ మృతుడు మల్లేశ్ బంధువులు, స్నేహితులు నష్టపరిహారం చెల్లించాలని నందంచారి ఇంటికి చేరుకున్నారు. గ్రామస్తులు, నందంచారి కుటుంబసభ్యులు నష్టపరిహారం ఇచ్చేందుకు ఇష్టపడటం లేదని ఆరోపిస్తూ గ్రామంలోని షాద్‌నగర్, అమనగల్లు రోడ్డుపై ధర్నా నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న సీఐ నరహరి, ఎస్ఐ రాజ్‌కుమార్ సిబ్బందితో అక్కడి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఇరువర్గాలతో మాట్లాడి ధర్నాను విరమింపజేశారు.

స్థానిక సంస్థల్లో యువతకు ప్రాధాన్యం


కాంగ్రెస్ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు


యువ నాయకులతో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


తాండూరు: శ్మశాన వాటికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పేరి రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. యాలాలలో కాంగ్రెస్ పటిష్టతకు కృషి చేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, కోఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, ఏఎంసీ డైరెక్టర్ రాజు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతప్ప, యువజన కాంగ్రెస్ నాయకులు వీరేశం, మన్నాన్, నాయకులు నాగయ్య, అశోక్ నాయీ, శేఖర్, లాలప్ప, మైనోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ప్రాధాన్యం ఇస్తామని ఎమ్మెల్యే మనోహ ర్‌రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ యువ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఆ తర్వాత యువ నాయకులు జగదీశ్ జన్మదినం సందర్భంగా శుభాకంక్షాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగప్ప, గోపాల్ పురుషోత్తం రెడ్డి, సుధాకర్, శ్రీనివాస్‌గౌడ్, హరిశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ శ్మశానవాటికను అభివృద్ధి చేస్తా

తాండూరు: అంత్యక్రియలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు బీసీ శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం బీసీ నాయకులతో కలిసి శ్మశాన వాటికను ఆయన సందర్శించారు. శ్మశాన వాటిక ప్రాంగణంలో కంపచెట్లు, పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం ఉండడంతో అసహనం వ్యక్తం చేశారు. పదేళ్లుగా ఎందుకు అభివృద్ధి చేయలేదని వారిని ప్రశ్నించారు. 8ఏళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయని, మున్సిపల్ అధికారులు పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పట్లోళ్ల నర్సింహులు ఎమ్మెల్యేదృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయంలో స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్, తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌పట్లోళ్ల బాల్‌రెడ్డి, యాలాల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, బీసీసంఘం నాయకులు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.